## ఆ దర్శకుడితో మరోసారి?



కొత్తవాళ్లను పరిచయం చేయడంలో నాగార్జున ఎప్పుడూ ముందే ఉంటారు. ఆయన ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన దర్శకుల సంఖ్య పెద్దదే. ఇటీవలే 'నా సామిరంగ' సినిమాతో కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేశారు నాగ్. ఆ సినిమా సంక్రాంతి హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం నాగ్ 'కుబేర'తో బిజీగా ఉన్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున అతిథి పాత్ర పోషిస్తున్నారు. అందులో హీరో ధనుష్. అయితే.. హీరోగా నాగ్ నెక్ట్స్ సినిమా ఏంటి? అనేది అభిమానుల్లో నెలకొనివున్న ప్రశ్న. దానికి సమాధానంగా మళ్లీ విజయ్ బిన్నీతోనే ఆయన సినిమా చేయనున్నారట. ఇటీవలే విజయ్‌కి అడ్వాన్స్ కూడా ఇచ్చారని ఫిల్మ్‌నగర్ టాక్. వారిద్దరి కలయికలో వచ్చిన 'నా సామిరంగ' సినిమా మలయాళం రీమేక్. మరి ఈసారి సొంత కథతో వెళ్తున్నారని సమాచారం. త్వరలోనే అధికార ప్రకటన ఉంటుందని తెలుస్తున్నది.

## మోదీ బయోపిక్‌లో నటించను!



ప్రధాని మోదీ బయోపిక్‌లో తాను నటించబోతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ప్రముఖ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇప్పటివరకు తననెవరూ సంప్రదించలేదని ఆయన తెలిపారు. ఒకవేళ మోదీ బయోపిక్‌లో నటించే అవకాశం వచ్చినా తిరస్కరిస్తానని, తన సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధమైన సినిమాలో నటించలేనని సత్యరాజ్ వ్యాఖ్యానించారు. తమిళంలో మోదీ బయోపిక్‌ను తెరకెక్కించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో సత్యరాజ్ నటించనున్నారని గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సత్యరాజ్ ఈ విషయంపై స్పందించారు. 'ఈ వార్తలు నాకే ఆశ్చర్యం కలిగించాయి. ఇలాంటి అబద్ధపు ప్రచారాలను మానుకోవాలి. భవిష్యత్తులో మోదీ బయోపిక్ కోసం నన్ను ఎవరైనా సంప్రదిస్తే చేయనని చెబుతాను. ఎందుకంటే ఈ సినిమా నా భావజాలానికి, సిద్ధాంతాలకు పూర్తి వ్యతిరేకంగా ఉండే అవకాశం ఉంటుంది' అని సత్యరాజ్ పేర్కొన్నారు.



## సింగిల్‌గానే ఉన్నా!

**చెన్నై సోయగం శృతిహాసన్** తన ప్రేమబంధానికి గుడ్‌బై చెప్పింది. డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారికాతో ఈ భామ గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వీరిద్దరు విడిపోయారని ముంబయి మీడియాలో ప్రచారం జరుగుతున్నది. తాజాగా తన బ్రేకప్ న్యూస్‌ను అభిమానులతో జరిపిన ఇన్‌స్టాగ్రామ్ చిట్‌చాట్ ద్వారా వెల్లడించింది. 'మీరు సింగిలా? లేదా ఎవరితోనైనా ప్రేమలో ఉన్నారా? అని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు 'నేను సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు సమాధానమివ్వను. కానీ సమయం వచ్చింది కాబట్టి చెబుతున్నా. నేను ఇప్పుడు సింగిల్‌గా నా జీవితాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్నా. ఇంతకు మించి ఇంకేం చెప్పను' అని సమాధానమిచ్చింది. దీంతో తన బ్రేకప్‌ను శృతిహాసన్ అధికారికంగా కన్‌ఫర్మ్ చేసినట్లయిందని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. కోవిడ్ సమయంలో శంతను హజారికాతో శృతిహాసన్ డేటింగ్‌ను మొదలుపెట్టింది. ఈ జంట ముంబయిలో ఒకే ఫ్లాట్‌లో సహజీవనం చేశారు. ఇద్దరు కలిసి చేసిన ఫన్నీ వీడియోలను తరచుగా సోషల్‌మీడియా ద్వారా పంచుకునేవారు. నెలక్రితం వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో అయ్యారు. దాంతో ముంబయి మీడియాలో బ్రేకప్ వార్తలొచ్చాయి. శృతిహాసన్ తాజా చిట్‌చాట్‌తో అది నిజమని తేలిపోయింది. ప్రస్తుతం శృతిహాసన్ తెలుగులో 'సలార్-2' చిత్రంలో నటిస్తున్నది.

## ప్రేక్షకుల హృదయాలను గెలవాలి



'నాకు సినిమా తప్ప మరేదీ తెలియదు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌ను ఆరంభించే ముందు.. ఏ సినిమా చేసినా వినూత్నంగా ఉండాలని అనుకున్నాం. అలా తొలి ప్రయత్నంగా 'బలగం' చేశాం. ఇప్పుడు 'లవ్‌మీ' కూడా సరికొత్త కథతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు అగ్ర నిర్మాత దిల్‌రాజు. ఆయన సోదరుని కుమారుడు ఆశిష్ కథానాయకుడిగా అరుణ్ భీమవరపు దర్శకత్వంలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ తెరకెక్కించిన 'లవ్‌మీ' చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రేక్షకుల హృదయాలను గెలవటమే ఆశిష్ ముందున్న పెద్ద ఛాలెంజ్ అని, కష్టపడితే తను తప్పకుండా లక్ష్యాని చేరుకుంటాడని అన్నారు. ఈ సినిమాలో దర్శకుడు అరుణ్ భీమవరపు నాన్ లీనియర్ స్క్రీన్‌ప్లేకు కొత్త అర్థాన్నిచ్చాడని, సినిమా విజయంపై అందరూ కాన్ఫిడెంట్‌గా ఉన్నారని సంగీత దర్శకుడు కీరవాణి తెలిపారు. ఈ సినిమాకు 'కిల్ మీ ఇఫ్ యు లవ్' పేరుతో సీక్వెల్ కూడా ఉందని, త్వరలో దానిని ప్రారంభించాలని కోరుకుంటున్నానని దర్శకుడు అరుణ్ భీమవరపు పేర్కొన్నారు. ఈ సినిమాతో ఖచ్చితంగా హిట్ కొడుతున్నామని హీరో ఆశిష్ నమ్మకం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ..



ఇటీవలే విడుదలైన 'పుష్ప 2'లోని తొలి లిరికల్ సాంగ్ సినీప్రియులను విశేషంగా ఆకట్టుకోవడమే కాక, రికార్డ్ స్థాయి వ్యూస్‌ని దక్కించుకుంది. తాజాగా ఈ గురువారం మేకర్స్ మరో లిరికల్ అప్‌డేట్‌ని ఇచ్చారు. పుష్పరాజ్-శ్రీవల్లి కలిసి పాడుకున్న మెలొడీ సాంగ్‌ను 'కపుల్ సాంగ్'గా ఈ నెల 29న ఉదయం 11.07 నిమిషాలకు విడుదల చేయనున్నారు. దీనికోసం విడుదల చేసిన ప్రోమోలో రష్మిక మోడరన్‌గా కనిపించిన అందరికీ షాక్ ఇచ్చేసింది. ఆమె శ్రీవల్లిగా మారేందుకు మేకప్ చేసుకుంటుంటే, ఆమెపై ఈ ప్రోమోను మేకర్స్ కట్ చేశారు. 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ..' అని సాగే ఈ గీతానికి రష్మిక డాన్స్ చేస్తుండటం ఈ ప్రోమోలో చూడొచ్చు. 'పుష్ప'ని మించే స్థాయిలో ఈ 'పుష్ప 2' ఉండబోతున్నదని, బన్నీ నటనకు, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వప్రతిభకు ఈ సినిమా ఓ నిదర్శనంగా నిలువనున్నదని మైత్రీమూవీమేకర్స్ అధినేతలు నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప2' విడుదల కానుంది.

## కంటెంట్ ఉన్న కథ కచ్చితంగా నచ్చుతుంది



**'ఫుల్‌లెన్త్** కనిపించే ప్రధాన పాత్ర చేశానంతే. హీరోనని నేను అనుకోను. అసలు హీరో కావాలని నాకు లేదు. అభినయానికి అవకాశం ఉన్న పాత్రలు చేయడమే నాకిష్టం. కేరక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా స్థిరపడాలనేది నా లక్ష్యం. అయితే.. 'రాజుయాదవ్' కథ విన్నాక 'ఫుల్‌లెన్త్ నటించడానికి అవకాశం దొరికింది' అనిపించింది. అందుకే ఈ సినిమా చేశాను.' అని గెటప్ శ్రీను అన్నారు. ఆయన కథనాయకుడిగా నటించిన చిత్రం 'రాజుయాదవ్'. కృష్ణమాచారి దర్శకుడు. కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మాతలు. నేడు సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గెటప్‌శ్రీను విలేకరులతో ముచ్చటించారు. ' ఇందులో నాది చాలా కష్టమైన పాత్ర. ఒకానొక దశలో ఫెయిల్ అయిపోయానేమో అనుకున్నా. దర్శకుడు ఇచ్చిన స్ఫూర్తి వల్లే ఇది సాధ్యమైంది. ఇందులోని విజువల్స్, సన్నివేశాలు, మాటలు.. అన్నీ సహజంగా ఉంటాయి. కంటెంట్ ఉన్న సినిమా కాబట్టి కచ్చితంగా జనానికి నచ్చుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు గెటప్ శ్రీను. ఇంకా చెబుతూ-'తల్లిదండ్రులు తన బిడ్డల నుంచి ఏం కోరుకుంటున్నారు? అలాగే కొడుకు కోణంలో తల్లిదండ్రులు ఎలా ఉండాలి? ఈ ప్రశ్నలకు సమాధానం ఈ సినిమా. తల్లిదండ్రుల కలల్ని సాకారం చేయడానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కు తగ్గకూడదని చెప్పే సినిమా ఇది. ఫన్‌తో పాటు అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ సినిమాను ఆవిష్కరించాడు దర్శకుడు కృష్ణమాచారి. ఇందులో ప్రతి పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాంకేతికంగా కూడా అందరూ మెచ్చేలా సినిమా ఉంటుంది.' అని తెలిపారు గెటప్ శ్రీను.

## ఇళయరాజా నోటీసుల పర్వం



దిగ్గజ సంగీత దర్శకుడు, మ్యాస్ట్రో ఇళయరాజా గత కొంతకాలంగా వివాదాస్పద చర్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా తాను కంపోజ్ చేసిన పాటలను అనుమతి లేకుండా మ్యూజిక్ కన్సర్ట్స్‌లో ఆలపించడం, వివిధ మాధ్యమాల్లో ప్రసారం చేయడం, సినిమాల్లో ఉపయోగించడంపై అభ్యంతరం తెలుపుతూ సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపుతున్నారు. ఈ క్రమంలో ఆయన 'మంజుమ్మల్ బాయ్స్' నిర్మాణ సంస్థకు లీగల్ నోటీసులు పంపారు. ఇటీవలే విడుదలైన ఈ మలయాళ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమాలో ఇళయరాజా కంపోజ్ చేసిన 'గుణ' చిత్రంలోని 'కమ్మని ఈ ప్రేమ లేఖనే రాసింది హృదయమే..' అనే పాటను కొన్ని సందర్భాల్లో ఉపయోగించారు. తన అనుమతి లేకుండా ఈ పాటను వాడుకున్నారని, ఇది కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఇళయరాజా చిత్ర నిర్మాతలకు నోటీసులు పంపారు. ఈ విషయంపై చిత్ర బృందం ఇంకా స్పందించలేదు. ఇదిలావుండగా రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ' నిర్మాతలకు కూడా ఇళయరాజా ఇటీవలే లీగల్ నోటీసులు పంపించారు. ఈ సినిమా టైటిల్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లో తాను కంపోజ్ చేసిన పాటను వాడారని ఇళయరాజా నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్‌కు నోటీసులు పంపించారు. ఇళయరాజా వరుస నోటీసుల పర్వం తమిళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

## మెగాఫోన్ పట్టనున్న కొరియోగ్రాఫర్

కొరియోగ్రాఫర్లు దర్శకులుగా మారడం వేదాతం రాఘవయ్య నుంచి మొదలైంది. ఆ తర్వాత ప్రభుదేవ, లారెన్స్, అమ్మ రాజశేఖర్, విజయ్‌బిన్నీ, గణేశ్ మాస్టార్.. వీరంతా మెగా ఫోన్ పట్టినవారే.



వీరిలో ప్రభుదేవ, లారెన్స్ బ్లాక్‌బాస్టర్స్ తీశారు. ఈ వరుసలోనే మరో కొరియోగ్రాఫర్ మెగా ఫోన్ పట్టనున్నారు. ఈ సినిమాకు నిర్మాత కూడా తనే కావడం విశేషం. ఆయనే సతీశ్‌రాజ్. 'ఎస్.ఆర్. మూవీ జంక్షన్' పేరిట నిర్మాణ సంస్థని స్థాపించారాయన. ప్రముఖ నిర్మాత, నటుడు మురళీమోహన్ గురువారం బేనర్ లోగోను ఆవిష్కరించి, సతీశ్‌రాజ్‌కు శుభాశీస్సులు అందించారు. ఈ సందర్భంలోనే 'శ్రద్ధ సబూరి' పేరుతో సతీశ్‌రాజ్ రూపొందించిన సాయిబాబా భక్తి గీతాన్ని ప్రముఖ కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ కలిసి ఆవిష్కరించి సతీశ్‌రాజ్‌ను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, దర్శకుడు చంద్రమహేశ్, నటులు కాదంబరి కిరణ్, వినోద్‌బాల, హీరోయిన్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



## మహల్ మధ్యలో జ్వాల

మంచు లక్ష్మి త్వరలో జ్వాలగా దర్శనమివ్వనున్నది. 'యక్షిణి' వెబ్ సిరీస్‌లో ఆమె కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ పాత్ర పేరు 'జ్వాల'. గురువారం మేకర్స్ ఆమె లుక్‌ని విడుదల చేశారు. నిండుగా చీరకట్టుకుని ఓ పాడుబడ్డ మహల్ మధ్యలో నిలబడి గంభీరంగా నవ్వుతూ ఉన్న మంచులక్ష్మిని ఈ లుక్‌లో చూడొచ్చు. సరికొత్త అనుభూతిని పంచేలా ఫాంటసీ, కామెడీ, రొమాన్స్ అంశాలతో ఈ సిరీస్ రూపొందించబడిందని దర్శకుడు తేజ మార్ని చెప్పారు. వేదిక, మంచులక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్‌ని భారీ నిర్మాణ విలువలతో ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో జూన్ నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.





